క్లుప్తంగా

బర్రెల మందపై పులిదాడి

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్ నల్లకాల్వ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో శనివారం ఉదయం మేతకు వెళ్తున్న బర్రెల మందపై పెద్దపులి దాడి చేసింది. మందలో ఉన్న ఒక బర్రెదూడను పులినోట కరచుకుని అడవిలోకి లాక్కెళ్లింది. అయితే బర్రెలన్నీ మూకుమ్మడిగా పెద్దపులిని తరిమి దూడను రక్షించుకునేందుకు యత్నించాయి. బర్రెలు దాడికి రావడం చూసి పెద్ద పులి అక్కడ నుంచి పారిపోయింది. అయితే అప్పటికే దూడ మరణించింది. ఈ దూడ నల్లకాల్వ గ్రామానికి చెందిన వరమయ్య అనే రైతుది. కాగా బైర్లూటి రేంజ్ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిసరాలను నిశితంగా పరిశీలించారు. దూడ మాంసం కోసం తిరిగి పెద్ద పులి అక్కడికి రావచ్చు కాబట్టి, ఆ ప్రాంతంలో ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలను అమర్చి నిఘావేశారు. నష్టపోయిన రైతుకు అటవీశాఖ పరిహారం చెల్లించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గిరిజనులకు ఆరోగ్యంపై అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డా.పవన్‌కుమార్

ఆత్మకూరు: చెంచుగిరిజనులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బైర్లూటి వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. బైర్లూటి చెంచుగూడెంలో చెంచు గిరిజనులకు శనివారం ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజనులు తమ గూడెంలోని తమ ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బోరు నీటిని ఉపయోగించుకోవాలని చెప్పారు. పరిశుభ్రమైన, వేడివేడి ఆహార పదార్థాలనే తీసుకోవాలన్నారు. ఎవరైనా అస్వస్థతకు గురైతే నాటు మందులు వినియోగించకుండా సమీపంలోని వైద్యశాలకు చేరుకుని వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. బైర్లూటి పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉంటారని, ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గురవమ్మ, వైద్య సిబ్బంది తులసీ, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

మిడుతూరు: రైతు భరోసా పథకానికి ఇప్పటి వరకు దరఖాస్తు చేయని రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ పీరునాయక్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 లోపు రైతు భరోసా కేంద్రాలలో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. సందేహాలు ఏమైనా ఉంటే ఆర్‌బీకేలలో నివృత్తి చేసుకోవాలని చెప్పారు.

సామాజిక తనిఖీకి రంగం సిద్ధం


రికార్డులు సరిచేసుకుంటున్న సిబ్బంది

కొత్తపల్లి: మండలంలో వివిధ శాఖల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీకి రంగం సిద్ధం అయ్యింది. శనివారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో సామాజిక తనిఖీ సిబ్బంది రికార్డుల పరిశీలన చేపట్టారు. ఈ సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ మణికంఠ, డీఆర్పీలు ఆరుగురితో కలసి మండలంలో గ్రామగ్రామాన పనులపై సామాజిక తనిఖీ చేస్తారని ఏపీఓ రాజునాయక్ తెలిపారు. మండంలో ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ రాజ్ శాఖ, ఐటీడీఏ పనులపై ఈ సామాజిక తనిఖీలు చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు అన్ని పనులపై రికార్డు సరిగా ఉన్నాయా లేదా అని అందరూ సరిచేసుకోవాలని సూచించారు. సామాజిక తనిఖీ సిబ్బందికి స్థానిక సిబ్బంది సహకరించాలని ఆదేశించారు.

విత్తనాల మంజూరు

పగిడ్యాల: మండలానికి నాలుగు క్వింటాళ్ల పిల్లపెసర విత్తనాలు మంజూరైనట్లు వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతుకుమార్ తెలిపారు. పచ్చిరొట్ట ఎరువుగా పొలాల్లో దమ్ చేసుకోవాలనుకునే రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ప్రభుత్వం నిర్ణయించిన ధరను చెల్లించాల్సి ఉంటుందని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హనుమాన్ విజయ యాత్రను జయప్రదం చేయండి

నంద్యాల(వ్యవసాయం): హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించే వీర హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని బజరంగదళ్ కన్వీనర్ శ్రీకాంత్ కోరారు. శనివారం ఆయన స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బైక్ ర్యాలీలో యువకులు, మహిళలు, కుల సంఘాలు, వ్యాపార సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు. మధ్యాహ్నం 4 గంటలకు టెక్కె మార్కెట్ యార్డు నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, లింగేశ్వరబాబు పాల్గొన్నారు.

బడి తెరచిన రోజే జగనన్న కానుక

- పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్న అధికారులు
- ఇప్పటికే పాఠశాలలకు చేరిన దుస్తులు, పాఠ్యపుస్తకాలు, స్టీల్ గ్లాసులు
- త్వరలో బ్యాగులు, బెల్టులు, బూట్లు, నోట్‌పుస్తకాలు మంజూరు



విద్యార్థులకు మంజూరైన దుస్తులను తరగతుల వారీగా సర్దుతున్న సీఆర్పీలు, మొదటి విడతగా మంజూరైన పాఠ్యపుస్తకాలు

జూపాడుబంగ్లా: ప్రజలందరూ అక్షరజ్ఞానం కలిగి వుంటేనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తెచ్చారు. అందులో భాగంగానే విద్యార్థులకు ×జగనన్న విద్యాకానుక× కింద మూడుజతల యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాలు, బూట్లు, బ్యాగులు, బెల్టు, డిష్నరీలు అందజేస్తూ వారి విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారు. 2023-24 విద్యాసంవత్సరానికి పాఠశాలలు ప్రారంభమైన రోజునే పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

27,577 మంది విద్యార్థులకు కానుక

నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, మిడుతూరు, పాములపాడు, కొత్తపల్లి, పగిడ్యాల మండలాల్లో 27,577 మంది విద్యార్థులుండగా వారికి ఇప్పటిదాకా మొదటి విడతగా 84,595 పాఠ్యపుస్తకాలు, ఒక్కొక్కరికి మూడు జతల చొప్పున దుస్తులు, రాగిజావ తాగేందుకు 25,143 స్టీలు గ్లాసులు మంజూరైనట్లు ఆయా మండలాల ఎంఈఓలు వెల్లడించారు. 2023-24 విద్యాసంవత్సరానికి గాను జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానుండగా అదే రోజున విద్యార్థులకు విద్యాకానుక కిట్లను అందజేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అందుకనుగుణంగా ఇప్పటికే పాఠశాలలకు దుస్తులు, మొదటివిడత పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. త్వరలో బ్యాగులు, బెల్టులు, బూట్లు, డిష్నరీలు, నోట్‌పుస్తకాలు రానున్నాయి.

మండలాల వారీగా విద్యార్థులకు ఇప్పటి వరకు మంజూరైన విద్యాకానుక వివరాలు

మండలం	విద్యార్థుల సంఖ్య	పాఠ్యపుస్తకాలు	దుస్తులు	గ్లాసులు
జూపాడుబంగ్లా	4,362	14,487	4,362	3,829
మిడుతూరు	4,000	13,000	4,000	3,820
నందికొట్కూరు	7,820	20,000	7,820	6,520
పాములపాడు	4,217	14,472	4,217	4,217
కొత్తపల్లి	3,800	11,000	3,800	3,700
పగిడ్యాల	3,504	11,636	3,504	3,057
మొత్తం	27,703	84,595	27,703	25,143

విద్యార్థుల్లో ఆనందం

పాఠశాలల్లో ధనిక, పేద అనే భేదాభిప్రాయాలు విద్యార్థుల్లో రానివ్వకుండా ప్రభుత్వం పాఠశాలల్లో యూనిఫాంను అమలు చేస్తోంది. పాఠశాలలు తెరిచే సమయంలో పిల్లలకు యూనిఫాం, బూట్లు, టై, బెల్టులు కొనిచ్చేందుకు తల్లిదండ్రులు వ్యయ, ప్రయాసాలకు గురయ్యేవారు. పేద విద్యార్థుల తల్లిదండ్రులు వాటిని కొనివ్వలేక సతమతం అయ్యేవారు. తల్లిదండ్రుల ఆర్థిక స్థితిగతులను దృష్టిలో పెట్టుకొని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం, బూట్లు, టై, బెల్టు, పాఠ్య, నోట్‌పుస్తకాలను అందజేస్తుండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యూనిఫాంలో కొద్దిపాటి మార్పులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మొదట్లో ఖాకి నిక్కరు, తెల్లషర్టు ఉండేది. విద్యార్థినులకు బ్లూ ఫ్రాక్, తెల్లషర్టు ఉండేది. తర్వాత స్కైబ్లూ కలర్ షర్టు, తిక్‌బ్లూ ప్యాంటు ఉండేవి. వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థిని విద్యార్థులకు పింక్‌కలర్ షర్టు, ప్యాంటు మంజూరు చేశారు. ప్రస్తుతం విద్యార్థినులకు లైన్స్‌తోకూడిన పింక్‌కలర్‌షర్టు మంజూరు చేశారు.

పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యాకానుక అందజేస్తాం



పాఠశాలలు ప్రారంభించిన మొదటిరోజే విద్యార్థు లకు జగనన్న విద్యాకానుక వస్తువులు అందజేయనున్నాం. ప్రస్తుతం ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, స్టీలు గ్లాసు లను తరగతుల వారీగా విభజించి విద్యార్థులకు అందజేసేందుకు సిద్ధంగా ఉంచాం. వెంటనే వాటిని విద్యార్థుల సంఖ్యను అనుసరించి పాఠశాలలకు చేరవేయనున్నాం. ఇప్పటికే దుస్తులు, పాఠ్యపుస్తకాలు తీసుకెళ్లాలని పాఠశాలల హెచ్ఎంలకు సూచించాం. మిగిలిన వస్తువులు మంజూరైన వెంటనే వాటిని వెంటనే పాఠశాలలకు చేరవేస్తాం.

– మోహన్, ఎంఈఓ, జూపాడుబంగ్లా

నేడు శ్రీశైలంలో హనుమజ్జయంతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని పాతాళగంగ మార్గంలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం వైశాఖ బహుళ దశమిని పురస్కరించుకుని హనుమజ్జయంతి నిర్వహిస్తున్నట్లు ఈఓ ఎస్ లవన్న తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటలకు వేదపండితులు, అర్చకస్వాములు లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠిస్తారన్నారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజను నిర్వహిస్తారని చెప్పారు. శ్రీఆంజనేయస్వామివారికి శ్రీమన్యుసూక్త పారాయణ సహిత అభిషేకము, నాగవల్లి దళార్చన, పుష్పార్చన, నీరాజనం, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు చేపడతారన్నారు.

దుస్తుల నాణ్యత, కొలతల పరిశీలన


యూనిఫాం బట్టలను కొలతలు వేస్తున్న పీఆర్ ఏఈ, ఏపీఎం అంబమ్మ, ఎంఈఓ మోహన్

జూపాడుబంగ్లా: కలెక్టర్ మనజీర్ జీలాని శామూన్ ఆదేశాల మేరకు మండలానికి మంజూరైన జగనన్న విద్యా కానుక దుస్తులను నాడు–నేడు కమిటీ సభ్యులైన పీఆర్ ఏఈ బషీర్, ఎంఈఓ మోహన్, ఏపీఎం అంబమ్మ శనివారం పరిశీలించారు. ఉన్నత పాఠశాలలో నిల్వచేసిన దుస్తులను తరగతుల వారీగా నిర్ణీత కొలతల మేరకు ఉన్నాయా లేదా అని ర్యాండమ్‌గా కొలతలు వేసి చూశారు. అలాగే బట్టల నాణ్యతను తనిఖీచేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు రమణయ్య, కిరణ్, మల్లికార్జున, వెలుగు అకౌంటెంటు రమేష్ పాల్గొన్నారు.

లోకేష్ లోకల్ లీడర్ల స్క్రిప్టులు చదువుతున్నాడు

- మీ నాన్న నలభై ఏళ్ల పాలనలో ఏమి చేశారో చెప్పు
- చంద్రబాబు పాలనలో ప్రజలకు కనీస సౌకర్యాలు కరువు
- టీడీపీ అధికారంలోకి రావడం కలే
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి


సీతారామాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: యువగళం పేరుతో చేపడుతున్న పాదయాత్రలో నారాలోకేష్ లోకల్ లీడర్లు ఇచ్చిన స్క్రిప్టులు చదవడం తప్ప చేసేదేమీ లేదని, ఒనగూరే ప్రయోజనం అంతకన్నా లేదని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. సీతారామాపురం గ్రామంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక నాయకులు రాసి ఇచ్చిన చీటిలు పిచ్చోడి చేతికి రాయి ఇచ్చినట్లు లోకేష్‌కు ఇస్తున్నారన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పొందుతున్న లబ్ధి గురించి తెలుసుకున్న టీడీపీ నేతలు, వారి కుటుంబ సభ్యులే మాకు మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి కావాలని అంటున్న అక్షరసత్యాలు మీకు కనిపించవా అంటూ ప్రశ్నించారు. ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అనే మీ నాయన, మాజీ సీఎం చంద్రబాబు రాష్ట్రంలో ఏం చేశారో చెప్పాలని, పేరు మోసిన పంచాయతీలకు కనీసం కార్యాలయాలు కూడా లేకుండా చేయడమే మీ నలభై ఏళ్ల పాలనకు నిదర్శమన్నారు. పెయిడ్ ఆర్టిస్టులను వెంట పెట్టుకుని తిరగడం కాదని, సీతారామాపురంలో మా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ప్రజల సంఖ్యలో సగం కూడా నీ కార్యక్రమానికి రాలేదని ఎద్దేవ చేశారు. దేవుడి దయవలన నేను ఎంతో బాగున్నానని, నాకు ఎవరి నుంచి పైసా అవసరం లేదని, మా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్నామని స్పష్టం చేశారు. బాబు పోవాలి, సైకిల్ పోవాలి అనే నీ మాటలు చూస్తే నీ మైండ్ ఏంటో అర్థం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, సర్పంచ్ బుడ్డారెడ్డి తేజస్విని, మండల యువ నేత బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి, మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సార్.. పరీక్షల్లో మేమెలా పాసవ్వాలి?

- రెమిడియల్ క్లాసులు నిర్వహించని ఉపాధ్యాయులు
- విద్యార్థులు రావటం లేదని చేతులెత్తేస్తున్న వైనం
- అయోమయంలో పరీక్షార్థులు


మధ్యాహ్నం 12 గంటలకే మూతబడిన ఉన్నత పాఠశాల తరగతి గదులు

జూపాడుబంగ్లా: రెమిడియల్ క్లాసులు నిర్వహించకపోతే మేమెలా పాసవ్వాలని, ఇంటర్, పదోతరగతి విద్యార్థులు ఉపాధ్యాయులను ప్రశ్నిస్తున్నారు. ఈ ఏడాది వార్షిక పరీక్షల్లో ఇంటర్, పదో తరగతుల్లో ఉత్తీర్ణత శాతం భారీగా తగ్గింది. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వారికి వెంటనే సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనుంది. ఈనెల 24 నుంచి ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు, జూన్ 2 నుంచి పదోతరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఫెయిల్ అయిన పాఠ్యాంశాలలో వారిని తీర్చిదిద్ది ఉత్తీర్ణత సాధించేలా చేసేందుకుగాను ప్రతి ఉన్నత పాఠశాల, గురుకుల, మోడల్, కస్తూర్బా పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, ఇంటర్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రతి రోజూ రెండు, మూడు పాఠ్యాంశాల వారీగా రెమిడియల్ తరగతులను నిర్వహించాల్సి ఉంది. అయితే వేసవి సెలవులను ఎంజాయ్ చేయకుండా తమకిదేమి బాధరా అనుకొంటున్నారో ఏమో గానీ మండల కేంద్రంలోని పాఠశాలల్లో మొక్కుబడిగా రెమిడియల్ తరగతులను నిర్వహిస్తుండటంతో విద్యార్థులు మొక్కుబడిగా హాజరవుతున్నారు. ఉపాధ్యాయులు చర్యలు తీసుకొని ఫెయిల్ అయిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారు రెమిడియల్ తరగతులకు హాజరై ఫెయిల్ అయిన పాఠ్యాంశంలో ఉత్తీర్ణత సాధించేలా చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఎంతైనా ఉంది.

తప్పనిసరిగా క్లాసులు జరిగేలా చేస్తాం

కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో రెమిడియల్ తరగతులు నిర్ణీత సమయానుసారం నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించాం. జూపాడుబంగ్లా ఉన్నత పాఠశాలలో నిర్వహించే తరగతులకు విద్యార్థులు రావడం లేదని ఉపాధ్యాయులు మధ్యాహ్నం 12 వరకు ఉండి వెళ్తున్నట్లు మా దృష్టి వచ్చింది. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి తరగతులకు విద్యార్థులు హాజరయ్యేలా చేయడంతో పాటు ఉపాధ్యాయులు సక్రమంగా తరగతిలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.

– మోహన్, ఎంఈఓ, జూపాడుబంగ్లా

గడప గడపలో సంక్షేమ పాలన


సీతారామాపురంలో ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- సీతారామపురంలో గడప గడపకు మన ప్రభుత్వం

మహానంది : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ రాజ్యం కొనసాగుతుందని, ప్రతిపక్ష పార్టీలైన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కుటుంబాల వారే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి రావాలని కోరుతున్నారని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. సీతారామపురం గ్రామంలో శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి 10 గంటల వరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ప్రతి ఇంటినీ సందర్శించి పేద ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. పథకాలు రాని వారికి అందేలా అధికారులు సహకరించాలని కోరారు. ప్రతి ఇంటికీ కుటుంబ సభ్యుడిగా నేను ఉన్నాను అంటూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అంతకుముందు సీతారామాపురంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని, సర్పంచు తేజశ్విని, మండల యువ నేత బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అండగా ఉంటా...

బండి ఆత్మకూరు మండలం జి.లింగాపురం గ్రామంలో అనారోగ్యానికి గురైన వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసింహారెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించారు. అండగా ఉంటానని భరోసానిచ్చారు.

ఆక్రమణ దారుల నుంచి స్థలాన్ని కాపాడండి


ధ్రువపత్రాలతో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కొత్తపల్లి: ఆక్రమణ దారుల నుంచి తమ స్థలాన్ని కాపాడలాలని మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో ఎస్సీకాలనీ వాసులు బాలసుందరం, ఆల్‌ఫ్రెడ్, భాస్కర్, చంద్రబాబు, ఎల్లయ్య, మోహన్ శనివారం కాలనీలో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సీకాలనీకి చెందిన 384-6 సర్వేనంబర్‌లో సుమారు 2 సెంట్ల స్థలం వివిధ శుభకార్యాలు చేసుకునేందుకు గ్రామకంఠంలో ఉంది. ఈ స్థలాన్ని పెరుమాళ్ల సత్యరాజు 142 సర్వేనంబరుతో అడ్డదారిలో రిజిష్టర్ చేయించుకున్నాడని వారు ఆరోపించారు. ఈ విషయమై అధికారులను ఎన్ని మార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 9 సార్లు స్పందన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నా ఏ అధికారికూడా మాకు న్యాయం చేయలేదని, ఆక్రమణ దారుడికే వత్తాసు పలుకుతున్నారని వాపోయారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించని అధికారులపై తగుచర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు మౌలాలమ్మ, నారమ్మ, సంతోషమ్మ, సుగునమ్మ, మరియమ్మ, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన అభివృద్ధి పనుల పరిశీలన


ఘంటామఠం పనులపై అధికారులతో చర్చిస్తున్న ఈఓ లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానంలో ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు మహాకుభాభిషేక మహోత్సవాలను పురస్కరించుకొని శనివారం రాత్రి దేవస్థానం ఈఓ ఎస్ లవన్న ఘంటామఠం, రుద్రాభిషేకం, విభూతిమటం, ఏనుగుల చెరువు , గణేశ సదనమును అధికారులతో కలిసి పరిశీలించారు. ఈఓ మాట్లాడుతూ ఘంటామఠం, రుద్రాక్షమఠం, విభూతిమఠాలకు పరంజా ధృడంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పంచమఠాలకు సంబంధించిన మరమ్మతులు ఏమైనా ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. పంచమఠాలన్నింటినీ ఒకే సారి దర్శించుకునేందుకు వీలుగా అన్ని మఠాలను కలుపుతూ ఏక రహదారి నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే గణేష్ సదన్‌ను ఈ నెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనుండటంతో ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ వి.రామకృష్ణ, ఎం.నరసింహారెడ్డి, డీఈ మల్లికార్జునప్రసాద్, సహాయ స్థపతి ఉమావెంకట జరహర్, ఉద్యానవన అధికారి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

రేగడగూడూరు సొసైటీ సీఈఓగా కృష్ణమోహన్


ఉత్తర్వులు అందజేస్తున్న చైర్‌పర్సన్

వెలుగోడు: రేగడగూడూరు వ్యవసాయ సహకార పరపతి కేంద్రం (సొసైటీ) సీఈఓగా కృష్ణమోహన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ సీఈఓగా విధులు నిర్వహిస్తున్న మహేష్‌కు బ్యాంకులో ఉద్యోగం రావడంతో వెళ్లిపోయారు. ఆయన స్థానంలో కృష్ణమోహన్‌కు సీఈఓగా ప్రమోషన్ ఇస్తూ జిల్లా సీఈఓ ఆంజనేయులు ఉత్తర్వులు జారీ చేశారు. సింగిల్‌విండో చైర్‌పర్సన్ బన్నూరు విజయలక్ష్మీ ఆయనకు ఉత్తర్వులను అందజేశారు. వేల్పనూరు ఎంపీటీసీ జనాభారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'చలో కలెక్టరేట్' విజయవంతం చేయాలి

వెలుగోడు: ఈ నెల 15వ తేదీన చేపట్టిన జిల్లా కలెక్టర్ ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివ నాగరాణి, జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ నాయక్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనుల వద్దకు వెళ్లి కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో పరిపాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి, పని ప్రదేశాలలో ఫోటో యాప్ తో కూలీలను మానసికంగా వేధిస్తోందన్నారు. కార్యక్రమంలో మేటీల సంఘం నాయకులు నూరుల్లా, శంకరమ్మ, పార్వతి, శివమ్మ, ఈశ్వరమ్మ, మరియమ్మ పాల్గొన్నారు.

రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవాలి


లోకా అదాలత్‌లో పాల్గొన్న నందికొట్కూరు జడ్జీలు


కేసులు పరిశీలిస్తున్న ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

నందికొట్కూరు: రాజీ మార్గంలోనే కేసులను పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి దివాకర్ అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో సివిల్-7, క్రిమినల్-74, బ్యాంకు కేసులు-13 పరిష్కరించిట్లు తెలిపారు. జాతీయ లోకా అదాలత్‌లో 94 కేసులను పరిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్, తహసీల్దార్ రాజశేఖర్ బాబు, బ్యాంకు అధికారులు, ఏపీపీ కృష్ణ కిషోర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారం

ఆత్మకూరు: పట్టణంలోని స్థానిక కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్ కార్యక్రమంలో పలు కేసులు పరిష్కారమైనట్లు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరావు తెలిపారు. 63 క్రిమినల్ కేసులు, 3 సివిల్ కేసులు, 3 మెయింటెనెన్స్ కేసులు, ఆత్మకూరు, పాములపాడు యునియన్ బ్యాంక్‌లకు చెందిన 3 కేసులు పరిష్కారం అయ్యాయని, రూ.4లక్షల 45 వేలు రికవరీ చేశామన్నారు. క్రిమినల్ కేసులో చలానా రూపంలో రూ.2,81,800లు వసూలు చేసినట్లు చెప్పారు. మొత్తం 72 కేసులు పరిష్కరించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్, న్యాయవాదులు బలరాం నాయక్, మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

వికసించిన మే పుష్పం


నాగేంద్రరావు ఇంట్లో వికసించిన పుష్పం

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఉన్న ఎం.నాగేంద్రరావు ఇంట్లో మే పుష్పం వికసించింది. సంవత్సరానికి ఒకసారి మాత్రమే మే – జూన్‌నెలల్లోని అరుదుగా ఈ పుష్పం పుష్పిస్తుంది. దీనిని స్థానిక ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు.